

ఉపాధి హామీలో వెనకంజ

- వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక - కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కూలీలకు ఉపాధి హామీ చట్టం పనులు కల్పించడంలో జిల్లా వెనుకబడి ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాష డ్వామా అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఉపాధి కూలీల వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జీ అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధి హామీ చట్టం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం అమలుపై లోతుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలసల నివారణ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ చట్టం ద్వారా పేదలకు పనులు కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. ఉపాధి పనుల కల్పనలో జిల్లా చాలా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబానికి ఉపాధి కల్పనలో సగటున కర్నూలు జిల్లా 26.93 శాతంతో 25వ స్థానంలో ఉందని తెలిపారు. అలాగే పనిదినాలు కల్పించడంలో 99 శాతంతో 15వ స్థానంలో ఉందని, రాయలసీమ ప్రాంతమైన కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో వెనుకబడి ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. వలసలు వెళ్తున్న ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి, ఆస్పరి మండలాలతో పాటు తుగ్గలి, కోడుమూరు, వెల్దుర్తి, క్రిష్ణగిరి, నందవరం మండలాల్లో కూడా తక్కువ శాతం పనులు కల్పించారని తెలిపారు. కృష్ణాజిల్లాలో 193, పార్వతీపురం మన్యం జిల్లాలో 164 శాతం పనులు కల్పిస్తే, ఎంతో అవసరం ఉన్న కర్నూలు జిల్లాలో 99 శాతం మాత్రమే కల్పించడమేమిటని ప్రశ్నించారు. 200 శాతం ఉపాధి కల్పన దిశగా లక్ష్యాలు పెట్టుకుని పని చేయాలన్నారు. ఏపీడీలు గ్రామాలకు వెళ్లి, అన్ని గ్రామాల్లో పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో ఇనాక్టివ్‌గా ఉన్న 1.50 లక్షల జాబ్ కార్డులు ఏ కారణం చేత ఇనాక్టివ్ అయ్యాయో తెలుసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు. వలసల నివారణపై ఏపీడీలు గ్రామాలకు వెళ్లి సర్వే చేపట్టి, ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. వలసలు వెళ్లే ప్రతి మండలానికీ ఒక ఇన్‌ఛార్జీని నియమించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న చెరువులకు కెనాల్ ద్వారా నీటిని నింపే విధంగా ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, వాటర్‌షెడ్ అధికారులు చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్ఇ రామ్మోహన్, డ్వామా ఏపీడీలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిఇలు పాల్గొన్నారు.



గుర్తింపునకు నోచని 'కౌలు'

- సిసిఆర్‌సి కార్డుల జారీలో జాప్యం - ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పొలాన్ని కౌలుకు తీసుకుని ఆరుగాలం కష్టించి పని చేసే కౌలు రైతు గుర్తింపునకు కూడా నోచుకోవడం లేదు. పంటల సాగు హక్కు పత్రాల జారీ (సిసిఆర్‌సి)లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ ప్రారంభమైనా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సిసిఆర్‌సి కార్డుల జారీ ప్రక్రియ ఇప్పుడే ప్రారంభించారు. దీంతో కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందక నష్టపోతున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కౌలు రైతులకు పంటల సాగు హక్కు పత్రాల (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో లక్ష మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. సొంత పొలం సాగు చేసుకుంటూ మరికొంత పొలం కౌలుకు తీసుకుని సాగుచేసేవారు సైతం ఉన్నారు. ఏప్రిల్ ప్రారంభం నుండి సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్డుల జారీ నత్తనడకన సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు సిసిఆర్‌సి కార్డుల లక్ష్యాలను నిర్దేశిస్తూ గత నెల 4న ఆదేశాలు జారీ అయ్యాయి. నెల రోజులు దాటినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా సిసిఆర్‌సి కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 30 వరకూ సమయం ఇచ్చారు. దీంతో కార్డుల జారీ ఈ నెలలో జరిగే అవకాశం లేకుండా పోయింది. గతేడాది కర్నూలు జిల్లాలో 18,751 మంది రైతులకు, నంద్యాల జిల్లాలో 22,742 మంది కౌలుదారులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేశారు. 2024-25లో ఉమ్మడి జిల్లాలో 50 వేల మంది కౌలుదారులకు కార్డులు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారు. ఉమ్మడి జిల్లాలో గతేడాది 41 వేల మంది కౌలుదారులకు సాగు హక్కు పత్రాలు జారీ చేయగా అందులో కేవలం 17,996 మందికే రైతు భరోసా పెట్టుబడి సాయం అందించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలుదారులను కులాలుగా విభజించి పెట్టుబడి సాయం అందించడం గమనార్హం. ఏడాది కాలంలో మూడు విడతల్లో 23 వేల మందికిపైగా కౌలుదారులకు రూ.32.50 కోట్ల సాయం దూరం చేశారు. ఇలా ఐదేళ్లలో పరిశీలిస్తే రూ.162.50 కోట్ల సాయం అందకుండా పోయింది. కౌలుదారులకు పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణాలిస్తామని వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. గతేడాది 41 వేల మందికి రూ. 220 కోట్ల పంట రుణాలివ్వాలని లక్ష్యాలు నిర్దేశించారు.



కర్నూలు జిల్లాలో రూ.123 కోట్లుగా లక్ష్యం పెట్టుకోగా కేవలం 376 మందికి రూ.2.44 కోట్లు మాత్రమే ఇచ్చారు. నంద్యాల జిల్లాలో రూ.97 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, 273 మంది కౌలుదారులకు రూ.4.42 కోట్లు మాత్రమే ఇచ్చారు. కౌలుదారులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు కౌలుదారులను గుర్తిస్తే రెవెన్యూ అధికారులు కార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కలిసి గ్రామసభలు నిర్వహించాల్సి ఉండగా రెండు శాఖలూ అసలు పట్టించుకోవడం లేదు.

నిబంధనతో అందని ప్రయోజనాలు

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్పుట్ సబ్సిడీ, రైతుభరోసాతోపాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా. కౌలురైతులకు లేకుండాపోయింది. కౌలుకార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం సాగుదారు హక్కు చట్టానికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

'రెవెన్యూ'లో అలజడి

- విఆర్ఒ అవినీతి బాగోతంపై చర్చ
- రెవెన్యూ కార్యాలయంలో అవినీతికి అదుపు లేదు
- విఆర్ఒపై చర్యలకు రంగం సిద్ధం..?

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతి బాగోతంపై మరోసారి చర్చ కొనసాగుతోంది. ఇటీవల కల్లూరు మండలంలో పనిచేసే ఓ విఆర్ఒ అవినీతి వ్యవహారం బట్టబయలు కావడంతో రెవెన్యూ శాఖలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఇప్పటికే విఆర్ఒ అవినీతి, అక్రమాలపై కూడా కలెక్టర్ తహశీల్దార్ ద్వారా నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. సదరు విఆర్ఒపై సస్పెన్షన్‌పై వేటు వేసేందుకు కూడా రంగం సిద్ధమైనట్లు తెలిసింది. గత రెండు రోజుల క్రితం విఆర్ఒ అవినీతి, అక్రమాల బాగోతంపై ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఒక సాధారణ విఆర్ఒగా పని చేసే వ్యక్తి రూ.కోట్ల విలువ చేసే భవన నిర్మాణం చేపట్టారు. గత కొన్ని రోజులుగా కల్లూరు మండలంలోనే తిష్ట వేసి ఆయన పనిచేస్తూ అధికార పార్టీ నేతలకు చెప్పిన పనులన్నీ చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. అతని అవినీతి, అక్రమాల బాగోతం వెనుక కొంతమంది రెవెన్యూలోని తహశీల్దార్లు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు తెలిసింది. ఇప్పుడు ఆ విఆర్ఒ అక్రమాలపై పెద్ద ఎత్తున మీడియాలో చర్చకు దారి తీయడంతో ఆ శాఖలోని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ శాఖలో అవినీతి, అక్రమాలు కేవలం క్షేత్రస్థాయిలో కాకుండా ఉన్నత స్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఇదే వ్యవహారం కొనసాగుతోంది. రెవెన్యూ శాఖలోని ఉన్నతస్థాయి కార్యాలయం నుంచి మండల స్థాయిలోని రెవెన్యూ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి కొనసాగుతోంది. భూములకు పట్టాలు పొందాలంటే, మ్యుటేషన్ చేయాలంటే కూడా రూ.లక్షల్లోనే డబ్బులు ముట్టచెబితే తప్ప ఆ పనులు పూర్తి కావు. వీటితోపాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ, ఇంటి నివాస పట్టాలు పొందాలంటే కూడా డబ్బులు ముట్ట చెప్పాల్సిందే. రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఎసిబికి పట్టుబడుతున్న అధికారులు, ఉద్యోగులు ఎక్కువగా ఈ శాఖలో పని చేసే వారే కావడం గమనార్హం. ఇప్పటికైనా రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విఆర్ఒను సస్పెన్షన్ చేయాలి

- కలెక్టర్‌కు డివైఎఫ్ఐ వినతి

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ కల్లూరు మండలంలో పని చేస్తున్న విఆర్ఒ మద్దిలేటిని సస్పెన్షన్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను డివైఎఫ్ఐ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్‌తో పాటు నగర అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్, హుస్సేన్ బాష ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఐదేళ్ల నుంచి కర్నూలు, కల్లూరు మండలాల, కర్నూలు అర్బన్ తహశీల్దార్ కార్యాలయాల పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టాలని కోరారు. సాధారణ కుటుంబం నుంచి విఆర్ఎగా పనిచేసి విఆర్ఒగా ప్రమోషన్ పొందిన మద్దిలేటి కర్నూలు మండలంలో పనిచేసినప్పుడు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కల్లూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఒ మద్దిలేటి ఈ మధ్యకాలంలో రూ.కోట్లు వెచ్చించి అతని స్వగ్రామంలో బిల్డింగ్ నిర్మించుకున్నారని చెప్పారు. ప్రస్తుతం డాక్టర్స్ కాలనీలో 11 సెంట్ల స్థలంలో భారీ బిల్డింగ్ నిర్మిస్తున్నారన్నారు. విఆర్ఒ మద్దిలేటికి డబ్బులిస్తే ఏ పనైనా చకచక జరుగుతుందని, లేదంటే సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిందేనని మండిపడ్డారు. అవినీతికి పాల్పడిన విఆర్ఒలు, సర్వేయర్లు, తహశీల్దార్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దపాడు వద్ద వడ్లోని వంక, దూపాడు పరిధిలో కొండ, గార్గేయపురం పరిధిలో నందనవనం పక్కలో ఉన్న వంక పరంబోకు కొండ, శ్మశాన స్థలం రికార్డులను పరిశీలించి, వాటిని రియల్ ఎస్టేట్ ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాయపడిన బాలునికి మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విద్యుదాఘాతంతో గాయపడి చికిత్స పొందుతున్న బాలుని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర రెడ్డి గురువారం పరామర్శించారు. ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజు దంపతుల కుమారుడు హుస్సేని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్ లైన్ తీగను తాకి తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నారి హుస్సేనికి ఎడమ చేయితోపాటు శరీరంలో కొంత భాగం కాలిపోయింది. కాలిపోయిన భాగాన్ని పరిశీలించి చిన్నారి పరిస్థితులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 శాతం కాలిన గాయాల వల్ల బాలునికి ప్రాణాపాయస్థితి లేదని తెలిపారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించాలని, మంచి ప్రోటీన్ ఆహారం, కావాల్సిన మందులు, అవసరమైతే లోకల్ పర్చేజ్ చేసి ఇస్తానని ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతికి ఆదేశించినట్లు తెలిపారు. ఆస్పత్రిలోనే చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని నింపి వారికి ఎలాంటి వైద్య సేవలు కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలతో పాటు హై యాంటీబయాటిక్ ట్రీట్‌మెంట్ అందించాలని సంబంధించిన హెచ్‌ఒడిని ఆదేశించినట్లు చెప్పారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కూడా ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. కాలిన రోగుల (బర్న్స్) విభాగాధిపతి డాక్టర్ మంజుల బాయ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బాలుని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి

నూతన డిఐజిగా కోయ ప్రవీణ్

- డిఐజి విజయరావు బదిలీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు రేంజ్ నూతన డిఐజిగా డాక్టర్ కోయ ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్ డిఐజిగా ఉన్న ప్రవీణ్‌ను కర్నూల్ రేంజ్ డిఐజిగా బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలు రేంజ్ డిఐజిగా ఉన్న సిహెచ్.విజయరావును బదిలీ చేస్తూ డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయరావు కర్నూలు రేంజ్ డిఐజిగా ఈ ఏడాది ఫిబ్రవరి 5న బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన 5 నెలలకే ఆయన బదిలీ అయ్యారు.





విష్ణువర్ధన్ రెడ్డి తల్లి మృతికి ఎంపీ నివాళి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి కోడుమూరు సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తల్లి రత్నమ్మ మృతదేహాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సందర్శించారు. కర్నూలు నగరంలోని విష్ణువర్ధన్ రెడ్డి నివాసంలో రత్నమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డిని పరామర్శించిన ఎంపీ రత్నమ్మ మృతికి కారణమైన అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- కెవిఆర్ కళాశాలలోఎంపీ పర్యటన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్య, వైద్యానికి తగిన ప్రాధాన్యత కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు తెలిపారు. గురువారం నగరంలోని కెవిఆర్ మహిళా జూనియర్ కళాశాలలో కర్నూల్ ఎంపీ పర్యటించారు. అక్కడ విద్యార్థినిలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ లాలప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. కళాశాలలో తరగతి గదులు హాస్టల్ సమస్యలన్నిటిని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల అధ్యాపకుల బృందం కర్నూలు ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, టిడిపి జిల్లా నాయకులు దేవేంద్రప్ప, రంగం సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కరుణాకర్ పాల్గొన్నారు.

ఇళ్ల పునర్నిర్మాణాలపై ఆరా

ప్రజాశక్తి - సిబెళగల్

టిడిపి అధికారంలోకి వచ్చాక మండలంలో ఇళ్ల పునర్నిర్మాణంపై జిల్లా ప్రాజెక్టు అధికారి సిద్ధలింగమూర్తి, మండల హౌసింగ్ ఎఇ సుమంత్ అధ్యక్షతన ఆరా తీశారు. గురువారం లెంటల్ లెవెల్ -3, ఆర్ లెవెల్ -7, బిఎల్ -6, ఆర్ఆర్ - 1 నిర్మాణంలో ఆగిపోయాయాని తెలిసి తిరిగి నిర్మాణాలపై లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు. అలాగే లబ్ధిదారులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఉపాధిలో 99 రోజులు వేతనం జమ చేసి డిసెంబర్ చివరిలోగా పూర్తి చేసేలా దృష్టి సారించాలని సూచించారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఒకరు లేక ఇద్దరు పిల్లలు చాలు

- అడ్వకేట్ పద్మలతా రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్త్రీ, పురుషులు వివాహం తర్వాత వారి ఆర్థిక స్థితిగతులను బట్టి ఒకరు లేదా ఇద్దరు పిల్లలను మాత్రమే కని వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేయాలని అడ్వకేట్ పద్మలతా రెడ్డి తెలిపారు. గురువారం యువజన సర్వీసుల శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెట్కూరు సిఇఒ పివి.రమణ మాట్లాడుతూ... ప్రస్తుతం భారత దేశ జనాభా 144 కోట్లు దాటిందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏ దేశం అయినా మనుగడ సాగించాలంటే యువ మానవ వనరులు అవసరమని తెలిపారు. ప్రస్తుతం భారత దేశంలో యువత చాలా భాగం ఉన్నారని, కానీ స్కిల్ ఉన్న యువత కొరతను భారత్ ఎదుర్కొంటోందని చెప్పారు. యువత క్రమ శిక్షణతో సరైన ట్రైనింగ్ కలిగి ఉంటే సరైన ఉద్యోగం లభించి తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎకనామిక్స్ లెక్చరర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదల వల్ల వచ్చే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రణాళికలు రూపొందించి అమలుకు కృషి చేస్తారని తెలిపారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీల విజేతలకు మెమెంటోలు ప్రశంసా పత్రాలను అందించారు. కళాశాల అధ్యాపకులు డి.పార్వతి, జి.రాధా రమణి, సుబ్బరాజమ్మ, సెట్కూరు సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాత్రాలను అందజేస్తున్న పద్మలతారెడ్డి

అపరాల వైపు మొగ్గు చూపాలి

- ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అశోక్‌కుమార్

ప్రజాశక్తి - వెల్దుర్తి

రైతులు అపరాల సాగుపై మొగ్గు చూపాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గోవర్ధనగిరి రైతు సేవా కేంద్రంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఉంచితంగా పిఆర్‌జి 176 కంది రకాన్ని అపరాల అభివృద్ధి పథకం కింద ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోవర్ధనగిరి గ్రామాన్ని అపరాల సాగులో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గోవర్ధనగిరి గ్రామంలో ఈ అపరాల సాగు పథకాన్ని ఐదేళ్ల పాటు చేస్తున్నట్లు చెప్పారు. కంది పంటలో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. పత్తి పంటను పరిశీలించి రైతులకు చీడ పీడలపై అవగాహన కల్పించారు. పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, డాక్టర్ ఎంవి.నిరంజన్ రెడ్డి, డాక్టర్ శ్రీచందన, ఆర్.అక్బర్ బాషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది లింగన్న, స్వరూప, మధు పాల్గొన్నారు.

కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

- తహశీల్దార్ షర్మిల

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలురైతులు కౌలు కార్డు కోసం విఆర్ఒ వద్ద దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ షర్మిల, ఎఒ పవన్ కుమార్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సచివాలయ వ్యవసాయ కార్యదర్శులు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌలు కార్డు దరఖాస్తు కోసం భూమి యజమాని పాసుపుస్తకం, భూమి యజమాని ఆధార్ కార్డ్, కౌలుదారు ఆధార్ కార్డ్ కౌలుదారు బ్యాంక్ జిరాక్స్ పత్రాలను సచివాలయంలో విఆర్ఒకు అందజేయాలని తెలిపారు. కౌలు కార్డు వచ్చిన తర్వాత ఆ పత్రం జిరాక్స్ కాపీని సచివాలయంలో వ్యవసాయ కార్యదర్శికి అందజేయాలని చెప్పారు. కౌలు కార్డు ఉన్న రైతులకు ప్రభుత్వం ద్వారా రైతులకు వచ్చే పథకాలన్నీ వర్తిస్తాయని తెలిపారు. కౌలుకు సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ, కమిషనర్ తొలి భేటీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ గురువారం నగరపాలక కార్యాలయంలో తొలిసారి మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీకి కమిషనర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందిస్తానని, నగరానికి సంబంధించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం నగరంలో చేపట్టిన అభివృద్ధి, పలు సమస్యలపై ఎంపీ, కమిషనర్ చర్చించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం

నిరంతర పోరాటం

- ఇయు జిల్లా కార్యదర్శి ఎవి.రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావం నుండి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎవి.రెడ్డి అన్నారు. గురువారం ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర కార్యదర్శి కె.మద్దిలేటి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎవి.రెడ్డి మాట్లాడుతూ నిజాం రైల్వేలో అంతర్భాగంగా రవాణా కార్మికుల శ్రేయస్సు కోసం ఏర్పడిన యూనియన్ క్రమేపి ఏపిఎస్ఆర్‌టిసిగా రూపాంతరం చెందిన తర్వాత 1952లో ఏపిఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గా ఆవిర్భవించిందన్నారు. ఆరు రోజుల పని దినాల తర్వాత వారాంతపు సెలవు ఇవ్వాలని, రోజుకు ఎనిమిది గంటల పని విధానం ఉండాలని పోరాడి సాధించిన యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ అని తెలిపారు. కార్మికులను వడ్డీ వ్యాపారుల నుండి రక్షించుట కొరకు సిసిఎస్ పేరుతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి సులభ పద్ధతిలో రుణాలు మంజూరు చేసి కార్మికులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేసిందన్నారు. 1980లో ఎస్‌బిటి స్థాపించి అకస్మాత్తుగా మరణించిన సందర్భాల్లో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాదాపుగా ఆరు లక్షలు ఆ కుటుంబానికి ఇచ్చే విధంగా కృషి చేసిందన్నారు. 2001లో చారిత్రాత్మక సమ్మె ద్వారా మెరుగైన వేతనాలు సాధించడమే కాకుండా మొట్టమొదటిసారి ఫిట్మెంట్ విధానం జరిపి కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు పెరిగే విధంగా కృషి చేసిందన్నారు. యూనియన్ కృషి ఫలితంగానే ఈరోజు ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని, ముందు కూడా ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకుంటూ ఉద్యోగులు పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. కర్నూలు-1 డిపో అధ్యక్షులు చంద్ర, డిపో కార్యదర్శి ఆర్‌విఎం.రావు, కర్నూలు-2 డిపో అధ్యక్షులు జివి.రెడ్డి, డిపో కార్యదర్శి మహేశ్వర రావు, రీజినల్ జాయింట్ సెక్రటరీ పి.కృష్ణారుణ రెడ్డి, డిపో జాయింట్ సెక్రటరీ కెసివై.కృష్ణ పాల్గొన్నారు.

తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం

- తొమ్మిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు : జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సరసమైన ధరల్లో నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తామని జెసి నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం స్థానిక సిక్యాంపు సెంటర్‌లో ఉన్న రైతు బజార్‌లో సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకుల ప్రత్యేక కౌంటర్‌ను జెసి నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలోని, రైతు బజార్, సిక్యాంప్ సెంటర్, రైతు బజార్, వెంకటరమణ కాలనీ, రైతు బజార్, ఆదోని, మండి మార్కెట్, కర్నూలు అర్బన్, మోర్ మార్కెట్, కర్నూలు, డిమార్ట్, కర్నూలు, స్పెన్సర్స్ కర్నూలు, జ్యోతి మాల్, కర్నూలు, రిలయన్స్, కర్నూలు, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కూడా తీసుకురావాలని, ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యం ఇస్తారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.181 ఉన్న కందిపప్పును రూ.160లకు, రూ.55.85 ఉన్న బియ్యం (స్టీమ్డ్ బిపిటి సోనామసూర్ బియ్యం)ను రూ.49లకు, రూ.52.40 ఉన్న బియ్యం (పచ్చి బిపిటి సోనామసూర్ బియ్యం)ను రూ.48లకు విక్రయించనున్నట్లు తెలిపారు. కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, డిఎస్ఒ కెవిఎస్ఎం ప్రసాద్, మార్కెటింగ్ ఎడి నారాయణమూర్తి, కల్లూరు తహశీల్దార్ మునివేలు, ఎఎస్ఒ రామాంజనేయులు, ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ పాల్గొన్నారు.

క్యాత్ ల్యాబ్ ద్వారా అత్యధిక ప్రొసీజర్లు

- జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రి సిఇఒ చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాయలసీమలోనే అత్యంత వేగంగా కేవలం మొదలు పెట్టిన 10 నెలల్లోనే 550 కి పైగా ప్రొసీజర్లు చేసి క్యాత్ ల్యాబ్ ప్రొసీజర్లో తిరుగులేని హాస్పిటల్‌గా దూసుకెళ్తుం ని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తమ దగ్గర అత్యంత ఆధునిక ఎక్విప్మెంట్ గల క్యాత్ ల్యాబ్ 24/7 అందుబాటులో ప్రత్యేకమైన టీంతో ఉంటుందని తెలిపారు. ఈ 550 ప్రొసీడర్స్ సంక్లిష్టమైన స్టెంటింగ్, చిన్న పిల్లలో సంక్లిష్టమైన వాల్ రీప్లేస్మెంట్‌లు ఎన్నో జరిగాయని, పేస్‌మేకర్స్‌లో కండక్షన్ పేసింగ్ సిస్టమ్ లాంటి అత్యాధునిక ప్రొసీజర్స్, కాంప్లెక్స్ యాంజియోప్లాస్టీలో రోటబ్లేషన్, బెలూన్ వాల్వులోప్లాస్టీ, డివైస్ క్లోజర్స్‌లాంటి అరుదైన క్లిష్టమైన ప్రొసీడర్స్ చేశామని పేర్కొన్నారు. చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ నతి కాలంలోనే క్యాథ్ ల్యాబ్‌లో 550 కి పైగా ప్రొసీజర్స్ చేయడం గర్వకారణంగా ఉందని, సహకరించిన తన టీంకి, హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో మరెన్నో సర్జరీలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, సిఓఓ డాక్టర్ గణేష్, జనరల్ మేనేజర్ నదీమ్, క్యాథ్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ధైర్యంగా ఉండండి.. నేనున్నాను
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడవద్దని, ధైర్యంగా ఉండాలని, తానున్నానని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపికి ప్రజల మద్దతు ఉందని చెప్పడానికి 40 శాతం ఓట్లు రావడమే నిదర్శనమన్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు పన్నిన కుట్రలో భాగంగానే ఓడిపోయామని తెలిపారు. ప్రజాక్షేత్రంలో వైసిపిదే గెలుపని పేర్కొన్నారు. టిడిపి పాలనలో దళారి వ్యవస్థ అప్పుడే మొదలైందని తెలిపారు. వాల్మీకులంతా ఒకటేనని ఎన్నికల్లో చెప్పిన నాయకులు ప్రస్తుతం డీలర్‌కు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు, వంట ఏజెన్సీలకు డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. కనీసం వాల్మీకులను కూడా వదిలిపెట్టలేదని తెలిపారు. నియోజకవర్గంలో అధికారులు ప్రొటోకాల్ పాటించి అందరికీ న్యాయం చేయాలని, లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ప్రజలకు మంచి సేవలందించామని, నాలుగోసారి కూడా గెలుపు సాధ్యమైందని తెలిపారు. ప్రజల కోసం తన కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మాబు సాబ్, మండల నాయకులు మహేందర్ రెడ్డి, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, చెన్నప్ప, బసవ ప్రభు, దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, గురునాథ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సర్పంచి పాల్ దినకరన్ పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆదోని



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

దేశంలో రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు అధికమవుతున్నాయని, అరికట్టడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ విమర్శించారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో 9 ఏళ్ల చిన్నారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం ఆదోనిలోని బాలికల కళాశాల ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. చిన్నారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, శశిధర్, గణేష్, సురేష్, యశ్వంత్, రాజు, ముని పాల్గొన్నారు.

హోం శాఖ మంత్రి బాల నిలబెట్టుకోవాలి

చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను బహిరంగంగా ఉరిశిక్ష విధించి రాష్ట్ర హోం శాఖ మాట నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. ఆదోనిలోని ఎఐవైఎఫ్ కార్యాలయంలో గోవిందమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు టి.వీరేష్, సహాయ కార్యదర్శి విజయ్, లక్ష్మీనారాయణ, ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గిరిమల్లప్ప, అంజలి గౌడ్, మహిళా సమాఖ్య నాయకులు కోటమ్మ, మాణిక్యమ్మ అన్నమ్మ పాల్గొన్నారు.

'కౌలు రైతులకు గుర్తింపు కార్డులు'

ప్రజాశక్తి - మంత్రాలయం


మండలంలోని గ్రామాల్లో గల కౌలురైతులు కౌలు గుర్తింపు కార్డులు అవసరమైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కౌలు రైతులను గుర్తించి వారికి కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వనున్నామని తెలిపారు. కౌలు గుర్తింపు కార్డులు కావాల్సిన వారు భూమి యజమాని ద్వారా అనుమతి పత్రంతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, యజమాని ఆధార్ కార్డు, రైతు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, రూ.10 అగ్రిమెంట్ పత్రంతో స్థానిక సచివాలయాల్లో విఆర్ఒలకుకానీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు కానీ అందించాలని సూచించారు. ఈ విషయంపై అవగాహన కోసం ప్రతి గ్రామంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. అందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ దండోరా వేయించాలని విఆంనొలను ఆదేశించారు. ఈ కౌలు కార్డుల ప్రక్రియ ఈనెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సాగు, తాగునీటి కోసం కలిసి పోరాడదాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాడదామని అఖిలపక్ష నాయకులు కోరారు. గురువారం ఆస్పరిలోని నారాయణ ప్రైమ్ స్కూల్లో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి, ప్రజాశక్తి ఆస్పరి విలేకరి మురళి, టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, వైసిపి నాయకులు ప్రకాష్, సిపిఐ నాయకులు ఉరుకుందప్ప, చిన్నవీరన్న, రంగస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ రాఘవేంద్ర


8 టిఎంసిల సామర్థ్యంతో వేదవతి నిర్మించాలి
- వేదవతి సాధన సమితి కన్వీనర్ మహానంది, ఆస్పరి



ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు నీటి సామర్థ్యాన్ని 3 టిఎంసిల నుండి 8 టిఎంసిలకు పెంచాలి. ప్రస్తుతం 3 టిఎంసిలకే డిజైన్ చేయడం వల్ల ఆస్పరి మండలానికి సాగునీరు అందే పరిస్థితి లేదు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచాలని సాధన సమితి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశాం. ప్రభుత్వం స్పందించి వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిలకు పెంచి వెంటనే పూర్తయ్యేలా చూడాలి.

తాగునీటి పరిష్కారానికి కలిసి ముందుకెళ్దాం
- జిల్లా కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ రాఘవేంద్ర

ఆస్పరి మండలానికి సాగు, తాగునీటి పరిష్కారం కోసం కలిసి ముందుకెళ్దాం. నీటి సమస్య పరిష్కారం కావాలంటే నాగనాథన హళ్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి నేరుగా చిగిలి సంపు ద్వారా ఆస్పరి గ్రామానికి నీరందించాలి. ఈ విషయంపై ఆస్పరి ప్రజాప్రతినిధులు కలిసి జిల్లా కలెక్టర్‌కు విన్నవించాం. ప్రస్తుతం నాగనాథనహళ్లి నుంచి ఆదోని మండలంలోని గ్రామాలకు నీరు వెళ్తుండడం వల్ల నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వేదవతి ప్రాజెక్టుతో పాటు హంద్రీ నుంచి వెంగళాయి దొడ్డి, ముత్తుకూరు, ఆస్పరి చెరువులకు నీటిని పంపింగ్ చేయాలి.

సాగునీటితో సస్యశ్యామలం
- టిడిపి నాయకులు మహేష్, బిల్లేకల్లు గ్రామం



సాగునీటితో ఆస్పరి మండలం సస్యశ్యామలం అవుతుంది. మండలం ప్రధానంగా వర్షాధారంపైనే ఆధార పడడంతో వర్షాలు రాక ప్రతిసారి రైతులు నష్టపోతున్నారు. వేదవతి ప్రాజెక్టు ఆస్పరి మండలానికి విస్తరించేలా చర్యలు తీసుకోవాలి.

హంద్రీనీవా నుంచి సాగు, తాగునీరందించాలి
- రంగస్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి



హంద్రీనీవా ద్వారా ఆస్పరి మండలానికి సాగు, తాగునీరందించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలి. రైతుసంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేపట్టాం.

నీటి సమస్యను పరిష్కరించాలి
- సొసైటీ మాజీ ఛైర్మన్ నౌనేపాటి చౌదరి, జొహరాపురం గామం



మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది. నీటి సమస్య పరిష్కారం కోసం హంద్రీనీవా నుంచి నీటిని సరఫరా చేసి నీటి సమస్యను పరిష్కరించాలి.

సాగు, తాగునీటి సమస్యను గుర్తిస్తాం
- తెలుగు యువత నాయకులు సతీష్, ఆస్పరి

మండలంలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యను ప్రభుత్వం గుర్తిస్తుంది. వేదవతి ప్రాజెక్టుకు 2014లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణాన్ని 8 టిఎంసిలకు పెంచాలని ప్రభుత్వ పెద్దలను కోరతాం.



మండలానికి సాగు, తాగునీరందించాలి
- ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి



వేదవతి, హంద్రీనీవా ప్రాజెక్టుల నుంచి సాగు, తాగు నీరందించాలి. కూటమి ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీరు సమస్య పరిష్కరించాలి.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు శాంతిరామ్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. గురువారం ఉర్దూ ఘర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వారి సహకారంతో 360 మందికి చికిత్స చేశారు. వారిలో 132 మంది కంటి ఆపరేషన్‌కు అర్హులని వైద్య సిబ్బంది తెలిపారు. వారికి ఉచిత బస్సు ఏర్పాటు చేసి వారిని కర్నూలుకు తీసుకెళ్లినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు, నాయకులకు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఎమ్మిగనూరు ప్రెసిడెంట్ హాజీ బడే సాబ్ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. బందేనవాజ్, కెఎస్.హుస్సేన్, ఎన్.నజీర్ అహ్మద్, రాళ్లదొడ్డి రఫీక్, నూరుల్లాఖాద్రీ, మస్తాన్ వలీ, కంబలన్నె ఖాజా, బాష, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు నాగార్జున

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. గురువారం టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మన్న మాట్లాడారు. కోసిగి మండలం దేశంలోనే అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ప్రాంతమని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సమృద్ధిగా ఉన్నప్పటికీ విద్యార్థులకు సరిపడిన ఉపాధ్యాయులు లేరని చెప్పారు. పేద విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. మండలంలో కొలమాన్ పేట, చిన్నబూంపల్లి, మూగలదొడ్డి, జంపాపురం తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. డీఎస్సీ నియామకాలు జరిగే వరకు విద్యార్థులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.నాగరాజు, విజయ్ కుమార్, నాయకులు పెద్ద రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మానవ మనుగడ ప్రశ్నార్థకం
- డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని


ఆదోనిలో మాట్లాడుతున్న సత్యవతి

భూమ్మీద జనాభా భారం పెరుగుతున్న కొద్దీ మానవ మనుగడ ప్రశ్నార్థంగా మారిందని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మాతా, శిశు ఆస్పత్రి నుంచి శ్రీనివాస్ భవన్ సర్కిల్, ఆంధ్ర బ్యాంక్ మీదుగా ఎంసిహెచ్ ఆస్పత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభా పెరుగుదల ప్రభావాలను గుర్తించి పరిష్కారం అన్వేషించే అవగాహన కోసమే జనాభా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి ప్రారంభించిందని తెలిపారు. డాక్టర్ మానస, అర్బన్ డాక్టర్స్ అనిల్ కుమార్, డాక్టర్ గాయత్రి, డాక్టర్స్, లెప్రసీ సూపర్‌వైజర్ సీతారాముడు, సూపర్‌వైజర్లు ఇంద్రధూర్తి, అరుణ, జ్ఞానేశ్వరి, మల్లికార్జున, నాగరాజు, స్టాఫ్ నర్స్ సౌజన్య, మెయిల్ వర్కర్ శేఖర్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ అవసరం

ప్రజాశక్తి - చిప్పగిరి

దేశంలో జనాభా నియంత్రణ చాలా అవసరమని, జనాభా పెరగడం వల్ల చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రభుత్వాస్పత్రి డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సిహెచ్ఒ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభా పెరగడం వల్ల నిరుద్యోగ సమస్య, భూ సమస్యలు, ఆహార సమస్య, నీటి సమస్య, ధరలు పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. జనాభా నియంత్రణకు ప్రస్తుత కాలంలో పురుషులకు వ్యాసక్టమీ ఆపరేషన్, మహిళలకు ట్యూబెక్టమీ, లాప్రోస్కోపిక్ ఆపరేషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. 'మనం ఇద్దరూ.. మనకి ఇద్దరూ సంతానం ఉంటే సంసారం కూడా చాలా చక్కగా ఉంటుంద'ని ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళు ఉంటేనే వివాహం చేయాలని సూచించారు. సంతానంలో మెళకువలు పాటించి బిడ్డ, బిడ్డకు మూడేళ్ల వ్యవధి ఉండేలా చూసుకోవాలన్నారు. టిబి సూపర్‌వైజర్ గోపాల్, ఫార్మాసిస్టు కృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ సుష్మ, స్టాఫ్ నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.


చిప్పగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఎస్సీ బాలుర వసతి గృహం ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హొళగుంద

ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం తహశీల్దార్ ప్రసాద్‌కు ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు మల్లికార్జున, నాగరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హొళగుంద ప్రభుత్వ భవనంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేశారని తెలిపారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం విద్యార్థులు తక్కువ ఉన్నారనే నెపంతో మూసివేసిందని చెప్పారు. హాస్టల్‌ను ప్రారంభించాలని గత నాలుగేళ్లుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారని తెలిపారు. కరువు ప్రాంతం కావడంతో రైతులు ఎక్కువగా వలసలు వెళుతుంటారని చెప్పారు. అలాంటి సమయంలో విద్యార్థులను హాస్టల్‌లో వదిలి వెళ్తారని, హాస్టల్ మూసివేయడంతో విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. మండలంలో బీసీ బాలుర వసతి గృహం ఉన్నా ఇక్కడ ఉన్న ఈ ఎస్సీ హాస్టల్ ను కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించి అడ్మిషన్లు కూడా చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఖూనిమొహల్లా ప్రాంతంలోని ఉర్దూ అండర్ పేట హైస్కూల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి గురువారం అవగాహన కల్పించారు. ఇంట్లో తడి, పొడి చెత్త ఎలా వేరు చేయాలో తెలిపి చెత్తను రీసైక్లింగ్ చేయడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని వివరించారు. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి అందరికీ మధ్యాహ్నం పూట భోజన పథకం ద్వారా భోజనం అందుతుందా లేదా, గుడ్లు, చిక్కీలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

'నాణ్యమైన విద్యనందించాలి'

పెద్దకడబూరు : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ ఉపాధ్యాయులను కోరారు. గురువారం ఆమె పెద్దకడబూరులోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాణ్యమైన విద్యనందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

నియోజకవర్గ ఇన్‌ఛార్జీపై రగడ వద్దు

- జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ వాల్మీకి లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ ఇన్‌ఛార్జీపై రగడ వద్దని, సాధారణంగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వారే నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఉండడం సహజమని జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ వాల్మీకి లక్ష్మన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద జనసేన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ విషయంలో పార్టీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జీలను ప్రకటించలేదని విమర్శలు చేస్తున్నారని స్పందించి వివరణ ఇచ్చారు. 2019లో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మంత్రాలయ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయానని, జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన వారే ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా కొనసాగుతారని చెప్పారని అన్నారు. నాటి నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి గ్రామంలో పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు గతంలో ఇచ్చిన లెటర్ ప్యాడ్‌కు కాలపరిమితి లేదన్నారు. జనసేన సోదరులు అనవసరంగా రచ్చకెక్కితే పార్టీ పరువు పోతుందని, పార్టీకి చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శలకు తావివ్వకుండా ఒకసారి అందరూ కలిసి మాట్లాడుకుందామని సూచించారు. వేసిన కమిటీలను కూడా కొన్ని మార్పులు చేర్పులు చేసి అధిష్టానానికి నివేదిద్దామన్నారు. కౌతాళం గ్రామం నుంచి జనసేన పార్టీలో చేరారు. ఎస్.రాంబాబు, ఎస్.దేవదాస్, లింగన్న, రామాంజనేయులు, మంజునాథ్, బసవరాజ్, వీరాంజనేయులు, నల్లన్న, బాలు, గోపాల్, మారుతి తదితరులు జనసేలో చేరారు. చిన్న, సుమిత్ర, ఎర్రి స్వామి, రమేష్, వీరారెడ్డి, రజాక్, గబ్బర్ సింగ్, బజారి, సుభాన్, హనుమన్న, హుసేని, ఈరన్న, లోకేష్, బీవీ.రవిచంద్ర, వెంకటేష్, వన్నూరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మన్న

ఆర్‌టిసి ఉద్యోగులను గౌరవిద్దాం
- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిసిని బతికించడానికి కార్మికులు అహర్నిశలు పని చేస్తున్నారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గురువారం ఆర్‌టిసి డిపోలో ఆదోని-బెంగళూరు సర్వీసుకు సంబంధించిన నూతన బస్సును డిపో మేనేజర్ ఎమ్.డి.రఫీక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఏదైనా పొరపాటు జరిగినప్పుడు ఆర్‌టిసి ఉద్యోగులను నిందించడం సరికాదని తెలిపారు. ప్రాణాలను పణంగా పెట్టి డ్రైవర్లు ఇబ్బందితో దూర ప్రాంతాల నుంచి డ్రైవింగ్ చేస్తూ కొంత అసహనానికి గురైనప్పుడు ప్రజలు, ప్రయాణికులు కొంత సంయమనం పాటించి వారికి గౌరవం ఇవ్వాలని కోరారు. వీలైనంత వరకు ప్రజలందరూ ఆర్‌టిసిలో ప్రయాణం చేయడం శ్రేయస్కరమని తెలిపారు. ప్రయాణికులకు భద్రత కల్పించడంలో ఆర్‌టిసి ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. అలాగే ప్రజల అవసరాలకు తగ్గట్టు ఇంకా ఎక్కువ బస్సులు పెంచాలని ఉన్నతాధికారులను కలిసి మాట్లాడతానని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఫిట్‌నెస్ లేని బస్సులను నడపకుండా వాటిని పూర్తిగా ఫిట్‌మెంట్ చేయించిన తర్వాతనే ప్రయాణానికి వాడాలని సూచించారు.


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆదోనిలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యంపై స్పందించి సకాలంలో వైద్యం అందేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఇంద్రభై, రాధిక, జ్యోతి, హారిక, ధనలక్ష్మి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నందవరం మండలం నదీ కొత్త కైరవాడి గ్రామానికి చెందిన ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గురువారం వరుడు థామస్ గ్రామానికి చేరుకున్న ఆయనకు స్వాగతం పలికి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా దంపతులిరువురికి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి చాంద్ బాష, ఎఐఎస్ఎఫ్ నాయకులు వెంకటేష్, వీరేష్ గౌడ్, ఆనంద్ రాజు, నర్సన్న, జానయ్య పాల్గొన్నారు.

30, 31న సామాజిక శిక్షణ తరగతులు
- కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని సంతేకుడ్లూరులో ఈనెల 30, 31న జరిగే సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప కోరారు. గురువారం ఆదోని మున్సిపల్ మైదానంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి దళితులు ఆర్థిక, సామాజిక సమానత్వానికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారని తెలిపారు. ఎస్సీ ప్రజాప్రతినిధులకు సైతం ఆ బాధ తప్పడం లేదని, సామాజిక తరగతుల మధ్య ఐక్యత, చైతన్య పోరాటాల ద్వారా వాటిని తిప్పి కొట్టవచ్చని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఉన్న సామాజిక ఉద్యమ కారులందరినీ సమీకరించి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కెవిపిఎస్ నాయకులు యువరాజు, వెంకటేష్, సద్దాం పాల్గొన్నారు.

ఎంపీని టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని టిడిపి మొలగవల్లి గ్రామ నాయకులు గురువారం ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రామనాథ్ యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, మాజీ ఎంపిటిసిలు అంజినయ్య, గోపాల్, మాజీ సర్పంచి రంగస్వామి మాట్లాడారు. మొలగవల్లి నుంచి హోసూరుకు అసంపూర్తిగా మిగిలిపోయిన బిటి రోడ్డును పూర్తి చేయాలని కోరారు. అలాగే మొలగవల్లి, నేమకల్లు రోడ్డును పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, కొత్త ట్యాంకులను మంజూరు చేయాలని కోరారు. టిడిపి నాయకులు యంకన్న, శీనప్ప, వార్డు మెంబర్ ఐకాంత్, శ్రీరామ్, జయరామ్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు
- అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల చారి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డిగ్రీ ప్రయివేట్ కళాశాలల అద్దె భవనాల్లో 30 సంవత్సరాల వరకు కొనసాగవచ్చని రాష్ట్ర ప్రభుత్వం జిఒ 20ని విడుదల చేయడంపై రాయలసీమ యూనివర్సిటీ ప్రయివేట్, అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాలాచారి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయంపై ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పలు ఇబ్బందులకు గురయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిఒ జారీకి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు గుడిసెలు, ఒక పశువుల పాక దగ్ధం
- నగదు, బంగారు, వెండి, ఆహార ధాన్యాలు దగ్ధం
- గిట్టనివారు నిప్పు పెట్టారు : బాధితులు

ప్రజాశక్తి - హొళగుంద


దగ్ధమైన గుడిసెలు, పశువుల పాక

రెండు గుడిసెలు, ఒక పశువుల పాక దగ్ధమైన సంఘటన గురువారం హొళగుంద మండలంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నగదు, బంగారం, వెండి, ఆహార ధాన్యాలు దగ్ధమయ్యాయి. గురువారం బోయ ముసానపల్లి శంకరప్పకు సంబంధించిన గుడిసెలో ఉన్న రూ.5 వేల నగదు, రెండు సంచుల బియ్యం, ఆరు సంచుల కందులు, మూడు సంచుల మిరప, మూడు సంచుల సజ్జ, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయి. మల్లయ్యకు సంబంధించిన గుడిసెలో రూ.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, 25 తులాల వెండి, పత్రాలు, సాగు భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు కాలి బూడిదయినట్లు బాధితులు వాపోయారు. తామంటే గిట్టని వారు ఈ పనికి వడిగట్టినట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమపై కోపం ఉంటే ఒ దెబ్బ కొట్టాలి కానీ, కడుపుపై కొట్టి తమను బజారుకు ఈడ్చారని వాపోయారు. తహశీల్దార్ ప్రసాద్ రాజు, ఆర్ఐ వినోద్ కుమార్, విఆర్ఒ నాగరాజు బాధితులను పరామర్శించారు. సంఘటనపై నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని, ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హొళగుంద పోలీసులు ఈ సంఘటనపై ఆరా తీస్తున్నారు.